
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శనివారం 6 జూలై 2024 | 5



అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి హుండీల
ఆదాయం రూ.46.11 లక్షలు

రామచంద్రపురం మండలం వెల్లలో
అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

- వివరాలు 7లో



“ప్రతి గ్రామాన్నీ ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం 2014లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమానికి అప్పటి టీడీపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందించడంతో క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలు వచ్చాయి. పలు గ్రామాలు స్వచ్ఛభారత్ అవార్డులకూ ఎంపికయ్యాయి. చెత్తతో సేంద్రియ ఎరువులను తయారు చేయడంతో ఆయా పంచాయతీలకు ఆదాయ వనరులు సమకూరడంతో పాటు గ్రామాలు ఆరోగ్యవంతంగా ఉండేవి. నేడు అందుకు భిన్నంగా వుంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు మూలనపడడంతో పాటు సరైన డంపింగ్ యార్డులు లేక పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది.”



లంకల గన్నవరంలో అక్కరకు రాని కేంద్రం

అలంకారప్రాయంగా...

- నాడు కళ కళ... నేడు కళావిహీనం
- ఐదేళ్ల కాలంలో కానరాని ‘జగనన్న స్వచ్ఛ సంకల్పం’
- జిల్లావ్యాప్తంగా 385 పంచాయతీల్లో 270 కేంద్రాలు
- వివిధ దశల్లో నిర్మాణంలో 70 షెడ్లు
- ఇదీ జిల్లాలో చెత్తతో సంపద సృష్టి కేంద్రాల దుస్థితి

పి.గన్నవరం, జూలై 5:

పి.గన్నవరం మండలం కుందాలపల్లిలో ఏర్పాటుచేసిన చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే ఆదర్శంగా నిలిచింది. జిల్లా నలుమూలల నుంచి సర్పంచ్‌లు, కార్యదర్శులు ఇక్కడికి వచ్చి అవగహన పొందే వారు. అదే సమయంలో ఈ గ్రామ సర్పంచ్ ఢిల్లీలో జాతీయ స్థాయి అవార్డు అందుకున్నారు. అప్పట్లో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రోజే కార్తికేయ మిశ్రా కుందాలపల్లి వచ్చి కేంద్రాన్ని పరిశీలించి బాగుందని కితాబు ఇచ్చారు. ఇలా టీడీపీ హయాంలో కళకళలాడిన సంపద సృష్టి కేంద్రాలు వైసీపీ ప్రభుత్వంలో కళావిహీనంగా మారాయి. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక దృష్టి కనబరిస్తే సంపద సృష్టి కేంద్రాలకు పూర్వవైభవం వచ్చే అవకాశముంది.

2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా చేపట్టిన చెత్తతో సంపద తయారీ కేంద్రాలు మూలనపడ్డాయి. గ్రామాల్లో షెడ్లు ఉన్నప్పటికీ చెత్త ద్వారా ఎరువుల తయారీ పూర్తిగా ఆగిపోయింది. టీడీపీ హ యాంలో కోనసీమతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో తయారైన వర్మీకంపోస్టును ఏజెన్సీలోని పలు మండలాల్లో విక్రయించారు. వైసీపీ ప్రభుత్వం అందించిన స్వచ్ఛసంకల్పం వాహనాలు, రిక్షాలు పలుచోట్ల ఇంకా నిరుపయోగంగానే ఉన్నాయి. పలు గ్రామాల్లో డ్రైవర్లు లేక సంబంధిత వాహనాలు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడం గమనార్హం. మరోవైపు గ్రామాల రూపురేఖలు మార్చు చేస్తామని చెప్పి కొన్నిచోట్ల కేంద్రాల నిర్మాణాలు చేస్తూనే ఉన్నారు. టీడీపీ హయాంలో గ్రామంలో 250 కుటుంబాలకు ఒక గ్రీన్ అంబాసిడర్ (వైసీసీ ప్రభుత్వంలో క్లీన్ ఆంధ్ర-క్లాప్‌మిత్ర)ను నియమించారు. సంపద తయారీ కేంద్రం వద్ద గ్రీన్ గాడ్ (వైసీపీ హయాంలో క్లాప్‌మిత్ర షెడ్) నియమించారు. ప్రభుత్వం వారికి రూ.6వేలు జీతం ఇచ్చేంది. వారు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్తలను సేకరించి సంపద తయారీ షెడ్ల వద్దకు తీసుకు వచ్చేవారు. ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు పూర్తిస్థాయిలో రాకపోవడంతో కొన్ని గ్రామాల్లో వారికి జీతాలను విస్మరించారు. అయితే ప్రస్తుత పరిస్థితిలో పలు గ్రామాల్లో చెత్తతో సంపద తయారీ కేంద్రాలు పేరు దేవుడెరుగు డంపింగ్ యార్డులూ కరువయ్యాయి. జిల్లాలోని కొన్ని మేజర్ పంచాయతీల్లో చెత్తతో సంపద సృష్టి కేంద్రాలు మూలనపడటంతో డంపింగ్ యార్డులు లేక నానా అవస్థలు పడుతు న్నారు. నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన పి.గన్నవరంతో పాటు అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీదీ అదే పరిస్థితి. మాచవరంలో అయితే చెత్త గొడవలు తారస్థాయికి చేరిన సందర్భాలు అనేకం. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో గోదావరి నదీతీరాలు, డ్రైన్లు, ఏటిగట్లే డంపింగ్ యార్డులుగా వున్నాయి. మొత్తంగా చూసుకుంటే జిల్లాలో కొన్నిచోట్ల చెత్తతో సంపద తయారీ కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇంకొన్నిచోట్ల నేటికీ పూర్తికాకపోగా మరికొన్ని చోట్ల రేకుల షెడ్లు అలంకారప్రాయంగా ఉన్నాయి.

కోనసీమ జిల్లావ్యాప్తంగా 385 పంచాయతీలకు గాను 270 పంచాయతీల్లో చెత్తతో సంపద తయారీ కేంద్రాలు అధికారిక లెక్కల ప్రకారం పూర్తయ్యాయి. గ్రామాల్లో 115 కేంద్రాల నిర్మాణానికి అనుమతి వచ్చింది. వాటిలో 46 కేంద్రాలు పునాదుల దశలోను, 17 కేంద్రాలు పిల్లర్ల దశలోను, ఏడు కేంద్రాలు రూఫ్ దశలోను ఉన్నాయి. పలు గ్రామాల్లో 30 కేంద్రాల నిర్మాణం ఇంకా చేపట్టలేదు. మరో 15 కేంద్రాలకు స్థానిక కారణాలతో మంజూరు రాలేదు. జిల్లాలో 1,532 (గ్రీన్ అంబాసిడర్) వైసీపీలో క్లాప్‌మిత్రలు ఉన్నారు. ఇదిలా ఉండగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించే ఈ కేంద్రాలకు వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సంబంధిత నిధులు పక్కకు మళ్లాయి. ఈ బిల్లుల కోసం మూడేళ్ల పాటు నిరీక్షించినట్టు సంబంధిత కాంట్రాక్టర్లు చెప్పుకొచ్చారు. దీంతో కేంద్రాల నిర్మాణానికి కొంతకాలం కాంట్రా క్టర్లు ముందుకు రాలేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. కొందరు కాంట్రాక్టర్లకు ఇప్పటికీ బిల్లులు రాలేదని సమాచారం.



రాజులపాలెంలో తయారీ కేంద్రం షెడ్డు పైకప్పు శిథిలమైన దృశ్యం



కుందాలపల్లి చెత్తతో సంపద తయారీ కేంద్రానికి అవగాహన కోసం ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు (పాత చిత్రం)



కుందాలపల్లిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా (పాత చిత్రం)



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఇసుక నిల్వలు చోరీ కాకుండా

భద్రతా చర్యలు

- ఇసుక స్టాక్ యార్డు పాయింట్ల వద్ద ప్రత్యేక నిఘా బృందాలు
- ఇసుక నిల్వల చోరీపై రేపు నివేదిక అందించాలి: కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక నిల్వలు చోరీ కాకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా స్థాయి ఇసుక కమిటీ అధ్యక్షుడు, కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని కలెక్టర్, జేసీ నుపూర్‌అజయ్ అధ్యక్షతన కమిటీ సభ్యులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏడు ఇసుక స్టాక్ యార్డు పాయింట్ల వద్ద ప్రత్యేక నిఘా బృందాలను నియమించాలని ఆదేశించారు. జిల్లా ఖనిజాభివృద్ధి సంస్థ అధికారి సాంకేతిక సిబ్బంది జిల్లాలోని కమిటీ అధికారులను సమన్వయం చేసుకుని చోరీకి గురైన ఇసుక నిల్వలను గుర్తించాలన్నారు. ఆధునిక డీజీపీఎస్ సాంకేతిక పరిజ్ఞానంతో చోరీకి గురైన ఇసుకను అంచనా వేసి ఆదివారం నాటికి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాలో ఇసుక తవ్వకాలకు అనువైన రీచ్‌లను గుర్తించాలని కమిటీ సభ్యులకు కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ స్టాక్ యార్డు పాయింట్లు, డిపోల నుంచి మాత్రమే ప్రజలకు ఇసుక సరఫరా చేయాలన్నారు. జియాలజీ అధికారులు, స్టాక్ యార్డుల్లో ఇసుక నిల్వలు, అమ్మకపు ధరల ఆమోదం కోసం నూతన పాలసీకి అనుగుణంగా తగు చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఇసుక పరిమాణంపై చర్చించారు. ర్యాంపు నిర్వహణ, పరిపాలనా కార్యకలాపాల ఖర్చులు, జీఎస్టీ తదితర అంశాలపై తదుపరి సమావేశంలో నిర్ణయిస్తామన్నారు. మెంబర్ కన్వీనర్‌తో జాయింట్ బ్యాంకు అక్కౌంట్ ప్రారంభించాలన్నారు. కమిటీ ఉపాధ్యక్షురాలు, జేసీ నుపూర్‌అజయ్ మాట్లాడుతూ యార్డుల వద్ద ఇసుక చోరీకి గురికాకుండా శాశ్వత ప్రాతిపదికన భద్రత దృష్ట్యా ట్రెంచ్ ఏర్పాటు చేయడంతో పాటు రాకపోకల గేట్లను బలోపేతం చేయాలన్నారు. సీసీ కెమెరాలను అమర్చి నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలన్నారు. షిఫ్ట్ విధానంలో ఎనిమిది గంటలకు ఒక బ్యాచ్ చొప్పున పోలీసు, రెవెన్యూ సిబ్బందిని నియమించి పర్యవేక్షణా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎస్పీ ఎస్.శ్రీధర్, అదనపు ఎస్పీ షేక్ ఖాదర్‌బాషా, భూగర్భజల శాఖ సహాయ సంచాలకుడు పి.శివప్రసాద్, డీటీవో అశోక్ ప్రతాప్‌రావు, ఆర్డీవోలు జేవీవీ సత్యనారాయణ, ఎస్.సుధాసాగర్, డీపీవో డి.రాంబాబు, జిల్లా ఖనిజాభివృద్ధి సంస్థ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ వి.సుజాత, సాంకేతిక సహాయకుడు కె.తులసీరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు

సన్నద్ధం కావాలి

- జిల్లాలో 105 వరద ప్రభావిత గ్రామాలు
- రూ.3.81 కోట్లతో డ్రైనేజీల్లో పూడికతీత పనులు పూర్తి చేయాలి: కలెక్టర్



అమలాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరదలు, తుఫానులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధం కావాలని కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రకృతి విపత్తులకు సంబంధించిముందస్తు చర్యలు, ముంపు బాధిత సహాయక చర్యల సన్నద్ధతపై ఆయన సమీక్షించారు. జిల్లాలోని 18 మండలాల పరిధిలో 105 వరద ప్రభావిత గ్రామాలు ఉన్నాయన్నారు. వాతావరణ శాఖ, ఇరిగేషన్ అధికారుల ద్వారా వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి వరద నీరు 13.75 అడుగుల స్థాయికి ప్రవహిస్తే కోనసీమ జిల్లాలో ఆ ప్రభావం తప్పనిసరిగా ఉంటుందన్నారు. కాబట్టి సహాయక చర్యలకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. లంక గ్రామాల్లో వరద ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఆయా ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఆస్తి, ప్రాణ నష్టాలకు తావు లేకుండా పనిచేయాలన్నారు. వరద ప్రభావిత గ్రామాలను మ్యాపింగ్ చేసుకోవడం ద్వారా సహాయ చర్యలు సులభతరం అవుతాయన్నారు. జలవనరుల శాఖ అధికారులు ఇసుక బస్తాలను సిద్ధం చేసుకుని ఏటిగట్ల పటిష్టతపై దృష్టి పెట్టాలన్నారు. డ్రైనేజీ శాఖకు మంజూరైన రూ.3.81 కోట్లతో పూడికతీత పనులు పూర్తి చేయాలన్నారు. మత్స్య శాఖ అధికారులు అవసరమైన పడవలతో పాటు గత ఈతగాళ్లను సిద్ధం చేయాలన్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద నిత్యావసరాలను బంపర్ స్టాకులుగా ఉంచుకుని కిరోసిన్ కూడా సిద్ధం చేయాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి గ్రామాల్లో సమాచార కేంద్రాలు ఏర్పాటుచేసి వరద హెచ్చరికలకు అనుగుణంగా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



ఉప్పలగుప్తం విద్యుత్ సబ్ స్టేషన్

- చల్లపల్లి వాటర్ ప్రాజెక్టుకు డైరెక్ట్ విద్యుత్ లైన్ కట్
- పట్టించుకోని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు
- తాగునీటి సరఫరాకు నిత్యం అడ్డంకులే...
- ప్రజల ఆందోళన



గొల్లవిల్లిలో తాగునీటి ఇక్కట్లకు అద్దంపడుతున్న దృశ్యం



ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం

ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల వైఫల్యం

ఉప్పలగుప్తం, జూలై 5: ఉప్పలగుప్తం విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి చల్లపల్లి వాటర్ ప్రాజెక్టుకు గతంలో ఉన్న డైరెక్ట్ విద్యుత్ లైన్ ఏమయ్యింది? దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఎందుకు స్పందించట్లేదు? విద్యుత్ సరఫరా నిలిస్తే పంపింగ్ నిలిచిపోయి, జనం దాహంతో అలమటిస్తున్నా సమస్య పరిష్కారానికి అధికారులు ఎందుకు ప్రయత్నించట్లేదు? తమ ప్రాజెక్టుకు ప్రత్యేక విద్యుత్ లైన్ ఉందన్న సంగతి అధికారులకు తెలియదా? ఈ ప్రశ్నలకు సమాధానం మాటేమిటో గానీ గత కొన్ని నెలలుగా గ్రామాల్లో జనం మాత్రం తాగునీటి ఇక్కట్లను అనుభవిస్తున్నారు. ఎన్ని రోజులకు కుళాయిలు కరుణిస్తాయో తెలియదు. గ్రామాల్లో ట్యాంకులు పూర్తిగా నిండక కొంతమందికే నీరందుతోంది. పవర్ సమస్య సాకుతో అధికారులు తప్పించుకుంటున్నారు. జనరేటర్ ఏర్పాటుకు అవకాశం లేదని చేతులెత్తేశారు. తరచూ విద్యుత్ సరఫరా అంతరాయాలను అధిగమించేందుకు ఉప్పలగుప్తం విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి చల్లపల్లి వాటర్ ప్రాజెక్టుకు నేరుగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. దీని కోసం ఆర్‌డబ్ల్యుఎస్ అప్పట్లో పాతిక లక్షలు చెల్లించింది. దీంతో తరచు ఏర్పడే విద్యుత్ అంతరాయాలకు అడ్డుకట్ట పడింది. రోజంతా పంపింగ్ ప్రక్రియ జరిగి తాగునీటి ఇక్కట్లు తొలగిపోయాయి. అనంతరం చల్లపల్లిలో రెండో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించారు. వాటర్ ప్రాజెక్టుకు చల్లపల్లి స్టేషన్ దగ్గరగా ఉంటుందని ఉప్పలగుప్తం బదులు చల్లపల్లి నుంచి వాటర్ ప్రాజెక్టుకు డైరెక్ట్ లైన్ వేశారు. అనంతరం ఆక్వా చెరువులు, ఇతర సర్వీసులను ఈ లైన్‌పైనే నడిపి ఈ లైన్‌ను ఎస్.యానాం వరకు పొడిగించారు. దీంతో ప్రత్యేక లైన్ సాధారణ లైన్‌గా రూపొందింది. అప్పట్నుంచీ చల్లపల్లి వాటర్ ప్రాజెక్టుకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. రోజుకు పలుమార్లు ఈ లైన్‌లో అవరోధాలు ఏర్పడి ప్రాజెక్టులో వాటర్ పంపింగ్ గంటల తరబడి నిలిచిపోయి గ్రామాల్లో తాగునీటి ఇక్కట్లు కొన్ని నెలలుగా పెరుగుతూ వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం కరెంట్ కట్‌ను సాకుగా చూపించి తప్పుకుంటు న్నారు. అసలు సమస్యపై దృష్టి పెట్టడం లేదు. సబ్ స్టేషన్ నుంచి చల్లపల్లి ప్రాజెక్టుకు ప్రత్యేక విద్యుత్ లైన్ ఉందన్న స్పృహ కూడా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు లేకపోవడం గమనార్హం. ఇదే విషయమై ఆ శాఖ అధికారిని వివరణ కోరగా రికార్డులు చూస్తేగానీ చెప్పలేమన్నారు. తమ శాఖ సొమ్ము చెల్లించి ఏర్పాటు చేసుకున్న విద్యుత్ లైన్ ఉందో లేదో తెలియని పరిస్థితిలో ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ ఉన్నారు. నేరుగా ఏర్పాటు చేసుకున్న లైన్ ఉంటే 24 గంటలూ పంపింగ్ జరిగి అందరికీ పుష్కలంగా తాగునీరందేది. ఇప్పుడు చిన్నగా గాలి వీచినా, వర్షం వచ్చినా ప్రాజెక్టుకు విద్యుత్ సరఫరా ఆగిపోతోంది. ఈ విషయాన్ని గ్రహించిన ప్రజలు డైరెక్ట్ విద్యుత్ లైన్ ఏమైందని ప్రశ్నిస్తున్నారు. దీనిపై అధికారులు చెప్పిందేమంటే...

రికార్డులను పరిశీలిస్తున్నాం

సురేష్, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ

చల్లపల్లి ఆర్‌డబ్ల్యుఎస్ ప్రాజెక్టుకు ఉప్పలగుప్తం విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి నేరుగా విద్యుత్ లైన్ ఉండేదన్న సంగతి తెలియదు. ప్రస్తుతం మాత్రం సాధారణ లైన్‌పైనే ప్రాజెక్టుకు విద్యుత్ కనెక్షన్ ఉంది. డైరెక్ట్ లైన్ ఉండేదో లేదో రికార్డులు పరిశీలించాలి.

గతంలో ప్రత్యేక విద్యుత్ లైన్ ఉండేది

శ్రీహరి, ట్రాన్స్‌కో ఏఈ

గతంలో చల్లపల్లి ఆర్‌డబ్ల్యుఎస్ ప్రాజెక్టుకు ప్రత్యేక విద్యుత్ లైన్ ఉండేది. అనంతరం చల్లపల్లి సబ్ స్టేషన్ నుంచి లైన్ ఇచ్చారు. ప్రస్తుతం ఈ లైన్ ఎస్.యానాం వరకు విస్తరించి ఉంది. అంటే ఆక్వా సహా అన్ని కేటగిరీల సర్వీసులు ఈ లైన్ పైనే ఉన్నాయి. ఎక్కడ ఇబ్బంది వచ్చినా ఎల్‌సీ తీసుకోవడంతో ప్రాజెక్టుకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడం సర్వసాధారణమవుతోంది.

బాలికల అదృశ్యం కేసులపై ఎస్పీ సమీక్ష

అమలాపురం టౌన్, జూలై 5:

జిల్లాలో బాలికలు, మహిళల అదృశ్యం కేసులపై జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఎస్.శ్రీధర్ శుక్రవారం సమీక్షించారు. జిల్లాలోని ఏ పోలీసుస్టేషన్ పరిధిలో ఎంత మంది బాలికలు, మహిళలు అదృశ్యమయ్యారో వారి వివరాలు, నమోదు చేసిన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని కేసులను ఛేదించి ఆయా కుటుంబ సభ్యులకు అప్పగించారో లేదో తెలుసుకున్నారు. ప్రధానంగా చిన్న పిల్లలు, బాలికలు, మహిళల మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వాటిని సత్వరం ఛేదించే విధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. ఇప్పటికీ పరిష్కారం కాని కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న ఎస్పీ శ్రీధర్

ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ

అమలాపురం టౌన్, జూలై 5: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించే లక్ష్యంతో వ్యవసాయ శాఖ కమిషనరు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా శుక్రవారం అధికారుల బృందం అమలాపురం, అల్లవరం మండలాల పరిధిలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో లైసెన్సులు, రికార్డులు, స్టాకులను తనిఖీ చేయగా రూ.94వేలు విలువైన 41.150 లీటర్ల పురుగు మందు విక్రయాలను నిలిపివేసినట్టు శ్రీకాకుళం జిల్లా పలాస సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎల్వీ మధు, విజిలెన్స్ సీఐ లక్ష్మాజీ తెలిపారు. తనిఖీల్లో అమలాపురం ఏడీ ఎంఏ షంషీ, వ్యవసాయాధికారులు కడలి ధర్మప్రసాద్, ఎస్వీపీ సత్యనారాయణ పాల్గొన్నారు.



అమలాపురంలో విత్తనాల షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

రక్షిత మంచినీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోండి

అమలాపురం టౌన్, జూలై 5: డయేరియా వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు రక్షిత మంచినీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ, మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని ప్రజలు ఒక్కొక్కరికీ 55 లీటర్ల సురక్షిత మంచినీరు అందించాలని ఆదేశించారు. కమ్యూనిటీ రక్షిత మంచినీటి పథకాల ద్వారా నిత్యం రక్షిత తాగునీటిని సరఫరా చేయాలన్నారు. రక్షిత మంచినీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్ ఫిల్టర్లను రెగ్యులర్‌గా మారుస్తూ క్లోరినేషన్ చేపట్టి ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ ఇచ్చిన కుళాయి కనెక్షన్ల ద్వారా తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్లు ఎస్.మనోహర్, జి.వెంకట్రామిరెడ్డి, డీపీవో డి.రాంబాబు పాల్గొన్నారు.



ప్రాణాలతో చెలగాటం!

జూనోసిస్ డే సందర్భంగా ప్రత్యేక కథనం

కరప, జూలై 5: విశాఖ జిల్లా భీమిలిలో గత నెల పెంపుడు కుక్క కరిచి 27ఏళ్ల భార్గవ్ మృతి చెందాడు. పెట్ డాగ్ కరవడంతో అతనికి రేబిస్ వ్యాధి సోకి చిన్నవయసులోనే చనిపోయాడు. కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక నాలుగు రోజుల వ్యవధిలో అతని తండ్రి కూడా తనువు చాలించాడు. ఆ ఇంట్లో ఇంతటి విషాదానికి కారణం ఒక పెంపుడు కుక్క. రేబిస్ వ్యాధితో అది చనిపోవడం.. అప్పటివరకు భార్గవ్ మేల్కోకపోవడం వల్ల ఆ కుటుంబానికి తీరని వేదన మిగిలింది. పెంపుడు జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధుల పట్ల సరైన అవగాహన లేకపోవడం, వాటి పెంపకంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, సకాలంలో వ్యాక్సిన్‌లు వేయించకపోవడం తదితర కారణాల వల్ల సమాజంలో ఇటువంటి దారుణ సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

పశువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి పశువులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు (సంక్రమిత వ్యాధులు) అంటారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 200లకు పైగా జూనోటిక్ వ్యాధులు సంక్రమిస్తున్నట్టుగా శాస్త్రవేత్తలు గుర్తించారు. పశుపోషకులు, పాల ఉత్పత్తిదారులు, పెంపుడు కుక్కల యజమానులు, రైతులు, పశువైద్యులు, జంతు ప్రదర్శనశాలల సిబ్బంది, పరిశోధనశాలల్లో పనిచేసే సిబ్బందికి ఈ జూనోటిక్ వ్యాధులు ఎక్కువగా సోకుతున్నాయి. లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొట్టమొదటిసారి 1885 జూలై 6వ తేదీన పిచ్చికుక్క కాటుకి గురైన ఒక వ్యక్తి ప్రాణాలను యాంటీ రేబిస్ టీకాతో కాపాడిన సందర్భంగా ఏటా ఈరోజును జూనోసిస్ డేగా నిర్వహిస్తున్నారు. జూనోటిక్ వ్యాధులను వైరస్, బ్యాక్టీరియల్, ప్యారసైటిక్ వ్యాధులుగా విభజించవచ్చు. వైరస్ వల్ల సంక్రమించే వ్యాధులలో రేబిస్, మెదడువాపు, బర్డ్ ఫ్లూ వంటివి ముఖ్యమైనవి. బ్యాక్టీరియా వల్ల బ్రూసెల్లా, సాల్మోనెల్లా, లెప్టోసైరోసిస్, క్షయ, దొమ్మరోగం, ధనుర్వాతం వంటి వ్యాధులు సోకుతాయి. పరాన్న జీవుల వల్ల సంక్రమించే ప్యారసైటిక్ వ్యాధుల్లో బద్దె పురుగులు, ఏలికపాములు, ఫైలేరియా, హైడాటిడ్ వంటివి ప్రముఖంగా చెప్పుకోవచ్చు. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల అవగాహన పెంపొందించుకుని అప్రమత్తతతో వ్యవహరిస్తే వాటి ముప్పు నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

యజమానులు అప్రమత్తంగా ఉండాలి..

పెంపుడు జంతువుల యజమానులు వాటి పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అప్రమత్తంగా ఉంటూ వాటి ప్రవర్తనలో తేడాలను గమనించాలి. రేబిస్ నివారణకు సకాలంలో టీకాలను వేయించాలి. అలాగే పశువైద్యుడు సూచించిన షెడ్యూల్ ప్రకారం వ్యాక్సిన్‌లు ఇప్పించాలి. వాటి ఆహారాన్ని లేదా వ్యర్థాలను తాకిన తరువాత చేతలను శుభ్రంగా కడుక్కోవాలి. పెంపుడు జంతువులు అడవి జంతువులతో కలవకుండా చూసుకోవాలి. పెంపుడు జంతువుల్లో అసాధారణ ప్రవర్తనలను గమనిస్తే వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించాలి.

పాడి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

పాడిరైతులు తమ పశువులను సాకే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జంతు సమూహాల మధ్య కదిలేటప్పుడు పాదరక్షలు, రక్షిత దుస్తులు ఉపయోగించాలి. పశువుల శాలలు, పాలు పితికే ప్రదేశాలు పరిశుభ్రంగా ఉంచాలి. పశువులకు క్రమంతప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించాలి. అనారోగ్యంతో ఉన్నవాటిని మంద నుంచి తప్పించాలి. జూనోటిక్ వ్యాధుల వ్యాప్తి, నివారణా చర్యలపై అవగాహన పెంపొందించుకోవాలి.

సంపూర్ణ అవగాహనతో వ్యాధులు దూరం

సంపూర్ణ అవగాహనతో జూనోటిక్ వ్యాధులకు దూరంగా ఉండొచ్చు. ఈ వ్యాధుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. జంతు ఉత్పత్తులను పూర్తిగా వండడం, సురక్షితమైన ఆహార నిర్వహణ, సరైన రీతిలో నిల్వచేయడంపై దృష్టిసారించాలి. వ్యాధులను వ్యాప్తిచేసే కీటకాలు, ఎలుకల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. రేబిస్ లక్షణాలు ఉన్న పెంపుడు జంతువు కరిస్తేనే కాకుండా వాటి చొంగ వల్ల సులభంగా రేబిస్ సోకుతుంది. పిచ్చికుక్కలు మనుషుల ముఖం మీద, పశువుల ముట్టి మీద కరిస్తే ప్రాణాపాయం తలెత్తకుండా వెంటనే ఇమ్యూనోగ్లోబ్యులిన్స్ అనే టీకాను వేయించుకోవాలి.

సంక్రమణ వ్యాధుల నివారణకు చర్యలు



సంక్రమణ వ్యాధుల నివారణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది. జూనోసిస్ డే సందర్భంగా కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో 1,500 డోసుల రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను సిద్ధంచేశాం. రేబిస్‌కు చికిత్స లేదు. నివారణ ఒక్కటే మార్గం. పెంపుడు కుక్కల యజమానులు తమ కుక్కలను సమీప పశువైద్యశాలలు, రైతు సేవా కేంద్రాల వద్దకు తీసుకువచ్చి ఈ టీకా ఇప్పించాలి.

- డాక్టర్ ఎన్‌జేఎస్ సురేష్‌బాబు, పశుసంవర్ధకశాఖ ఏడీ, కరప ప్రాంతీయ పశువైద్యశాల

వెల్లలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

- డీఎస్పీ పరిశీలన, డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం తనిఖీలు
- దోషులను కఠినంగా శిక్షించాలి : దళిత నాయకులు



ధ్వంసం చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ద్రాక్షారామ, జూలై 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వెల్ల గ్రామంలో అరుంధతీపేట వద్ద రోడ్డుపక్కన 9 ఏళ్ల కిందట సిమెంటు దిమ్మపై బాబూజగజ్జీవన్ రామ్, అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి కిందపడేశారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో సచివాలయ సిబ్బంది విగ్రహం ధ్వంసంకావడం చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐ పి.దొరరాజు, ఎస్‌ఐ సురేంద్రబాబు పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్స్‌ను రప్పించారు. క్లూస్‌టీం సభ్యులు వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. ద్రాక్షారామ ఎస్‌ఐ సురేంద్రబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. డీఎస్పీ రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ సమాజంలో అశాంతి, అలజడి సృష్టించేందుకు అసాంఘిక శక్తులు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారన్నారు. సమాచారం తెలిసిన వెంటనే క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగాయని, దోషులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. కాగా సమాచారం తెలిసిన వెంటనే నియోజకవర్గానికి చెందిన దళిత, ప్రజా సంఘాల నాయకులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసంచేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ఎంపీపీ అంబ టి భవానీ, జనసేన నాయకుడు బుంగరాజు, టీడీపీ నాయకుడు రవ్వాభూషణం, వైసీపీ నాయకులు అంబటి తుకారాం, పోలినాటి ప్రసాద్, రైతుకూలీ సంఘం నాయకుడు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ నాయకుడు బి.సిద్ధూ డిమాండు చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ బి.రామకృష్ణ

అస్వస్థతకు గురైన వేద పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శ



వేద విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

అన్నవరం, జూలై5: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న స్మార్త, ఆగమ పాఠశాల విద్యార్థులు డయేరియా బారినపడడంతో స్థానిక శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ దేవస్థానం ఈవో రామచంద్రమోహన్‌తో కలసి పరామర్శించారు. వైద్యులను అడిగి వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. అస్వస్థతకు గురైన వారు కోలుకుంటున్న శివసదన్ కాటేజీలో మరింత మెరుగైన వైద్యం అందిస్తున్నారు. 17 మంది విద్యార్థులను వారంరోజులపాటు తమ ఇంటికి విద్యార్థుల తల్లిదండ్రులతో పంపించారు. పూర్తిగా కోలుకున్న తరువాత మిగిలిన వారిని పంపడం జరుగుతుందని అన్నారు. వేద పాఠశాల ఆవరణ, వాటర్‌ట్యాంక్‌లను పరిశుభ్రం చేస్తున్నారు. విద్యార్థులకు ఎమ్మెల్యే పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు వెన్నా శివ, పర్వత సురేష్, బద్ది రామారావు తదితరులు పాల్గొన్నారు.

లీటరు డీజిల్ రూ.80కే

- ఓ రైతుకు 200 లీటర్లు పోయించిన దుండగుడు
- బంకు సిబ్బందిని నమ్మబలికి ఆపై సొమ్ములతో పరారీ
- నల్లజర్ల మండలం అచ్చన్నపాలెంలో ఘటన



మోసానికి పాల్పడిన కేటుగాడు ఇతడే

నల్లజర్ల, జూలై 5: కేటుగాళ్లు పెట్రోల్ బంకులను టార్గెట్ చేస్తున్నారు. మొన్న నల్లజర్ల పెట్రోల్ బంకు వద్దకు కారులో వచ్చి రూ.19 వేల డీజిల్ కొట్టించుకుని నకిలీ ఏటీఎం ఇచ్చి పరారైన సంఘటన మరువక ముందే గురువారం మరో ఘటన వెలుగు చూసింది. దమ్ముల సీజన్‌కావడంతో అచ్చన్నపాలెం గ్రామానికి చెందిన రైతు కోడూరి భారత్ ట్రాక్టర్‌తోపాటు టిన్స్‌లో డీజిల్ కొట్టించుకోవడానికి బంకు వద్దకు వచ్చాడు. అక్కడే ఉన్న గుర్తుతెలియని వ్యక్తి తనకు జేసీబీ ఉందని, దానికి బిల్లు పెట్టుకోవడానికి లీటరు రూ.97 ఉన్న డీజిల్ రూ.80కే కొట్టిస్తా డబ్బులు ఇవ్వాలని చెప్పడంతో భరత్ 200 లీటర్లు కొట్టించుకుని సదరు వ్యక్తికి రూ.16 వేలు ఇచ్చి వెళ్లిపోయాడు. బంకు సిబ్బందికి, తాను డబ్బులు మొత్తం ఇస్తానని, మరో రెండు టిన్‌లు ఉన్నాయని, వాటిలో కూడా నింపాలని ఆ వ్యక్తి బైక్‌పై పరారయ్యాడు. సదరు బంకు సిబ్బంది శుక్రవారం నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతి రాజధాని నిర్మాణానికి కవల విద్యార్థినుల విరాళం

దాచుకున్న రూ.9999 సొమ్మును ఎమ్మెల్యేకు అందజేత



రాజధాని నిర్మాణానికి చిన్నారులు దాచుకున్న సొమ్మును ఎమ్మెల్యేకు అందిస్తున్న దృశ్యం

అంబాజీపేట, జూలై 5: తాము దాచుకున్న సొమ్మును కవల విద్యార్థినులు ఏపీ రాజధాని అమరావతి పునఃనిర్మాణానికి విరాళంగా అందించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీ పరిధిలోని కొర్లపాటిపాలానికి చెందిన యర్రంశెట్టి చిత్రహర్షిణి, చిత్రవర్షిణి స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నారు. తండ్రి నాగబాబు ఇచ్చిన డబ్బులను దాచుకున్న ఆ విద్యార్థినులు మొత్తం రూ.9,999ను స్థానికంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు రాజధాని నిమిత్తం అందించారు. చిన్నారుల తాతయ్య యర్రంశెట్టి పాండురంగారావు ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఆదేస్ఫూర్తితో ఆయన మనమరాళ్లు విరాళం ఇవ్వడంపై పలువురు వారి దాతృత్వాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.సరోవర్, తహశీల్దారు విమలకుమారి, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, హెచ్ఎం కె.సాయిరాం పాల్గొన్నారు.



గోరంట్లకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతున్న ఈవో

సత్యదేవుడి సన్నిధిలో ఎమ్మెల్యే గోరంట్ల పూజలు

అన్నవరం, జూలై 5: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధికి శుక్రవారం విచ్చేసిన రాజమహేంద్రవరం రూరల్ సీనియర్ శాసనసభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి తన కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం ఎమ్మెల్యే గోరంట్లకు వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

8న రాజమహేంద్రవరంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 5 : రాజమహేంద్రవరంలో ఈనెల 8వ తేదీన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరుగుతుందని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాజమహేంద్రవరం బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి ప్రధాన అజెండాగా సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ పాల్గొంటారన్నారు. మాజీ సీఎం జగన్ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి బీజేపీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

8న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా-2024

కార్పొరేషన్(కాకినాడ), జూలై 5: కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలో వివిధ కంపెనీల్లో ఉన్న అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయడానికి కాకినాడ గవర్నమెంట్ ఐటీఐలో ఈనెల 8న ఉదయం 9గంటలకు ఐటీఐ పాసైన విద్యార్థులకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా-2024 నిర్వహిస్తున్నట్టు కన్వీనర్ జీఎం వర్మ తెలిపారు. జిల్లాలో ప్రముఖ పరిశ్రమలనుంచి మేనేజ్‌మెంట్, స్టాఫ్ వచ్చి వారికి కావాల్సిన అప్రంటీస్ ట్రైనీస్‌ను ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేస్తారనన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో వివిధ ట్రేడ్లలో ట్రైనింగ్ కంప్లీట్ చేసి ఎన్టీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్, సర్టిఫికెట్లతో మేళాకు హాజరుకావాలన్నారు.

8న జాబ్‌మేళా

కలెక్టరేట్(కాకినాడ), జూలై 5: ఈనెల 8న సోమవారం వికాస కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారని ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన శుక్రవారం విడుదల చేశారు. పట్టాబి ఆగ్రోఫుడ్స్, శ్రీకాశేశ్వరి రిఫైనరీ అండ్ ఇండస్ట్రీ, అరబిందో ఫార్మాలో టెక్నీషియన్, డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ ప్రొడక్షన్, రాక్‌మెన్ ఇండస్ట్రీస్, డిక్సాన్ అండ్ హోండాయ్ మోబీస్ కంపెనీ టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. 35ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులు ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 8న సోమవారం వికాస కార్యాలయం కాకినాడ కలెక్టరేట్‌వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 7799376111 నెంబరును సంప్రదించాలన్నారు.

అంతర్వేది హుండీల ఆదాయం రూ.46.11 లక్షలు



ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

అంతర్వేది, జూలై 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ప్రధాన హుండీ ద్వారా రూ.44,47,752, గుర్రాలక్కమ్మ అమ్మవారి ఆలయ హుండీ ద్వారా రూ.26,572, అన్నదాన హుండీ ద్వారా రూ.1,09,888, మొత్తం 101 రోజులకుగాను హుండీల ద్వారా రూ.46,11,212 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అలాగే క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.19,452 వచ్చిందన్నారు. దేవదాయశాఖ అధికారి నాగమల్లేశ్వరరావు, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీటీసీ బైరా నాగరాజు, సూపరింటెండెంట్ విజయసారథి, ఈవో బొక్కా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లోవలో హుండీల ఆదాయం రూ.35 లక్షలు



ఆలయ ప్రాంగణంలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం

తునిరూరల్, జూలై5: లోవ దేవస్థానంలో అధికారులు హుండీలు లెక్కించారు. రూ.35,46,802 నగదు, 0.87 మిల్లీ గ్రాముల బంగారం, 3.200 కిలోల వెండి వచ్చినట్టు ఈవో విశ్వనాథరాజు తెలిపారు. ఆలయ సిబ్బంది లెక్కింపులో పాల్గొనగా జగన్నాథపురం గ్రూప్ టెంపుల్స్ అధికారి వద్దారి సత్యనారాయణ, సిరిపురం గ్రూప్ టెంపుల్స్ అధికారి సూర్యామణి లెక్కింపులో ప్రత్యేకాధికారులుగా పాల్గొన్నారు.



పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి రెండు లక్షల విరాళం

అన్నవరం, జూలై 5: అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం కాకినాడకు చెందిన అన్యం రాములు, సావిత్రమ్మ దంపతులు 1,00,116, కట్టిరెడ్డి లక్ష్మణరావు, నాగరత్నం దంపతులు పేరున 1,00,116 విరాళంగా సమర్పించారు. దాతలు ఈ మొత్తాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా, వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు.

మతిస్థిమితం లేని మహిళపై కత్తితో దాడి : నిందితుడికి రిమాండ్

గోకవరం, జూలై 5: మతిస్థిమితం లేని మహిళపై ఓ వ్యక్తి కత్తితో దాడికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. దేవీపట్నం మండలం సీతారం గ్రామానికి చెందిన ఈక సుబ్బలక్ష్మి బీఈడీ వరకు చదువుకుంది. సుమారు ఐదేళ్ల కిందట తల్లిదండ్రులు మృతి చెందడంతో అప్పటి నుంచి ఆమె మానసిక స్థితి బాగోలేదు. శుక్రవారం తెల్లవారుజామున ఆమె గోకవరం పరిసర ప్రాంతాల్లో తిరుగుతుండగా గోకవరం గ్రామానికి చెందిన ఎడ్ల సూరిబాబు వెళ్లి మద్యం తాగేందుకు డబ్బులుగానీ, బంగారంగానీ ఇవ్వాలని కత్తితో బెదిరించాడు. దీంతో సుబ్బలక్ష్మి అతని నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయగా చేతిలో ఉన్న చాకుతో కుడి చెయ్యి, కుడి బుగ్గపై గాయపర్చాడు. ఈ ఘటనపై బాధితురాలి సోదరుడు ఈక రాంబాబు ఫిర్యాదు మేరకు సూరిబాబుపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా నిందితుడికి 15 రోజులు రిమాండు విధించినట్టు ఎస్‌ఐ కూన నాగరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



రాజవొమ్మంగి జూలై 5: జడ్డంగి సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం జడ్డంగి గ్రామానికి చెందిన ఒడ్డు రాంబాబు అనే వ్యక్తి జడ్డంగి నుంచి రాజవొమ్మంగి వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డును గమనించకుండా ముందుకు వెళ్లడంతో మట్టి దిమ్మను ఢీ కొనడంతో దూరంగా ఎగిరిపడ్డాడు. రాంబాబు పడిన ప్రాంతంలో గాజు సీసా పెంకులు ఉండడంతో అవి ముఖానికి గుచ్చుకొని రాంబాబు గాయపడ్డాడు. పోలీసులు క్షతగాత్రుడిని జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

11వ పీఆర్సీలో మోసం చేసిన జగన్‌కు 11 సీట్లే

- ప్రభుత్వ పాఠశాలలకే 'తల్లికి వందనం' ఇవ్వాలి
- జీవో నెం.117 తక్షణం రద్దుచేయాలి
- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

అమలాపురంటౌన్, జూలై5: ప్రాథమిక విద్యారంగాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఎస్టీయూ రాష్ట్రఅధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ విమర్శించారు. జగన్ తుగ్లక్ పాలనతో మొత్తం విద్యారంగమే నిర్వీర్యమైందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. 11వ పీఆర్సీలో ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసంచేసిన జగన్‌కు రాష్ట్ర ప్రజలు 11 సీట్లే కేటాయించారని ఎద్దేవా చేశారు. ఎస్టీయూ కోనసీమ జిల్లా శాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అధ్యక్షతన శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం.117 విద్యారంగానికి తీరని నష్టం చేకూర్చిందన్నారు. దాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం ద్వారా పల్లె బడులు మూతపడే ప్రమాదం ఏర్పడిందన్నారు. 1, 2 తరగతుల్లో అడ్మిషన్లు తగ్గిపోయాయన్నారు. నాటి ప్రభుత్వ జీవోతో ఒక్కో ఉపాధ్యాయుడు 42 పీరియడ్లు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడడంతోపాటు నాన్ టీచింగ్ యాక్టివిటీలు పెరిగిపోయాయన్నారు. టాయిలెట్లు, మధ్యాహ్న భోజన పథకం వంటి ఎన్నో యాప్‌లను ఉపాధ్యాయులే చూడాల్సిన పరిస్థితి నుంచి బయటపడేలా ప్రతి ఉన్నత పాఠశాలకు డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలని కోరుతూ ఇప్పటికే విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందించామన్నారు. గత ప్రభుత్వం పరీక్షా విధానాన్ని సైతం లోపభూయిష్టంగా మార్చేసిందన్నారు. సీబీఎస్ఈ, ఎన్‌సీఆర్టీ, ఐబీ సిలబస్ అంటూ మాతృభాషకు తీరని అన్యాయం చేసిన ఘనత జగన్ ప్రభుత్వానిదేనన్నారు. విద్యార్థులు ఏ సిలబస్‌లో చదవాలో తెలియని అయోమయ పరిస్థితి కల్పించారన్నారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పీఎఫ్, సరెండర్ లీవ్ బకాయిలు రూ.25 వేల కోట్లకు పెంచేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన 'తల్లికి వందనం' పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని, అప్పుడే ప్రభుత్వ విద్యారంగం బలోపేతం అవుతుందన్నారు. పీఆర్సీ కమిషన్‌ను నియమించడంతోపాటు ఐఆర్ ప్రకటించాలని లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. నాటి ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ ఉద్యమించిన ఉపాధ్యాయులపై కేసులు పెట్టడంతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, వారికి మోక్షం కల్పించాలని కోరామన్నారు. విద్యాశాఖలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయడంతోపాటు 1998, 2008 ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చూడాలని కోరామన్నారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, ఆర్థిక కార్యదర్శి నేరేడుమిల్లి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చొప్పల రాంబాబు, అభయ్ కన్వీనర్ రాపాక ప్రసాద్, స్టేట్ కౌన్సిలర్ బోనం గంగాధర్ పాల్గొన్నారు.





బాధితులతో కలిసి ఆందోళన చేస్తున్న బత్తుల.. ఎమ్మెల్యేకు హామీ పత్రం ఇస్తున్న బ్యాంకు అధికారులు

జి.యర్రంపాలెంలో డ్వాక్రా మహిళల ఆందోళన

ఎమ్మెల్యే బత్తుల సంఘీభావం

దివాన్‌చెరువు, జూలై5: రాజానగరం మండలం జి.యర్రంపాలెం బ్యాంక్ ఆఫ్ బరోడా బిజినెస్ కరస్పాండెంట్ తమను దగా చేశాడని న్యాయం చేయాలంటూ బాధిత మహిళలు శుక్రవారం బ్యాంకు ఎదుట ఆందోళన చేపట్టారు. స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్దసంఖ్యలో బ్యాంకు వద్దకు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆందోళనకారుల వద్దకు చేరుకుని వారికి మద్దతుగా రోడ్డుపై బైఠాయించారు. బ్యాంకు, డీఆర్‌డీఏ అధికారులతో ఆయన చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంకులో రెండేళ్లుగా మోసం జరుగుతోందని, డ్వాక్రా మహిళలు బ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్‌కు సొమ్ము చెల్లించేవారన్నారు. ఆ సొమ్ము తీసుకుని బీసీ స్టాంప్ వేసి రిఫరెన్స్ నెంబర్ నమోదు చేసి రశీదు ఇచ్చేవారని, వాటిని డ్వాక్రా మహిళలు నమ్మి భద్రపర్చుకున్నారన్నారు. పాసుబుక్ ఎంట్రీలు వేసి ఇవ్వాలని ఎన్నిసార్లు కోరినా బ్యాంకు సిబ్బంది ఏవో సాకులు చెప్పి కాలయాపన చేశారన్నారు. బీసీకి సొమ్ము చెల్లించిన విషయం బ్యాంకు సిబ్బందికి, యానిమేటర్‌కు కూడా తెలుసని చెప్పారు. జి.యర్రంపాలెంతోపాటు కొండగుంటూరు, సంపత్‌నగరం, పుణ్యక్షేత్రం గ్రామాలకు చెందిన డ్వాక్రా సంఘాలు, అలాగే బంగారు పంట రుణాలకు సంబంధించి రూ.57,70,950 దుర్వినియోగం చేసినట్టు ఇంతవరకు పరిశీలనలో తేలిందన్నారు. ఇంకా జి.యర్రంపాలెంలోని 17 డ్వాక్రా సంఘాలకు సంబంధించిన లావాదేవీలను పరిశీలిస్తున్నారన్నారు. అనధికారికంగా రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు స్కామ్ జరిగినట్టు తెలుస్తోందన్నారు. తమ ఆందోళనతో దిగివచ్చిన బ్యాంకు ఉన్నతాధికారులు 45 రోజుల్లో బాధితులకు సొమ్ము చెల్లిస్తామని లిఖిత పూర్వకంగా తెలిపారన్నారు. దీంతో బాధితులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో తోరాటి శ్రీను, మద్దిరెడ్డి చినవెంకటేశ్వరరావు, బాబులు, పేపకాయల విస్సుమూర్తి, డీఆర్‌డీఏ పీడీ మూర్తి, డీపీడీ జనార్దన్, ఏపీఎం హేమ, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ పి.కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

•అమలాపురం •పి.గన్నవరం •రాజోలు •ముమ్మిడివరం •కొత్తపేట •మండపేట •రామచంద్రపురం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యానాం, జూలై 5: యానాంలో 11కేవీ విద్యుత్‌లైన్ వార్షిక మరమత్తుల కోసం శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అధికారులు తెలిపారు. యానాం టౌన్ ఏరియా (కామరాజ్‌నగర్, గాంధీ నగర్, ద్రాక్షారామ రోడ్డు, వెంకట్‌నగర్, అన్యం గార్డెన్స్, అంబేద్కర్ నగర్, పిల్లారాయవీధి, కామిశెట్టి వీధి, హైస్కూల్ రోడ్డు, వికాస్ కాలనీ, సిద్ధార్థనగర్, జిక్రియనగర్, యర్రాగార్డెన్స్, కొత్తపేట, మసీదువీధి, దోబీవీధి ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

గత పాలకులు వ్యవస్థలను చిన్నాభిన్నం చేశారు

రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, జూలై 5: గత పాలకులు ప్రాధాన్యతా అంశాలను గాలికొదిలి వ్యవస్థలను చిన్నాభిన్నం చేశారని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఎల్ఎస్ ల్యాండ్ మార్కులో జరిగిన నియోజకవర్గస్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రెయిన్లు, కాల్వలు, రోడ్లను వదిలేసి అవసరం లేని ఆర్బీకే, వెల్‌నెస్ కేంద్రాల వంటి వాటికి కోట్లు కుమ్మరించారన్నారు. రాజోలు నియోజకవర్గంలో 30వేల ఎకరాల సాగుభూమి ఉంటే రబీలో కేవలం 5వేల ఎకరాలు కూడా వరినాట్లు వేయలేని పరిస్థితికి గత పాలకులు తీసుకువచ్చారన్నారు. డ్రెయిన్లు, కాల్వలు బాగు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

చేసి ఉంటే ఈపరిస్థితి దాపురించేది కాదన్నారు. తాను ఈ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తానని, మీరంతా సహకరించాలని అధికారులను కోరారు. ప్రతీ ఒక్కరికీ అడిగే హక్కు ఉందని, ప్రతీ ఒక్కరూ పన్నులు చెలిస్తున్న విషయాన్ని గుర్తించాలన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అధికారులు పనిచేయాలన్నారు. రోడ్ల ప్రక్క చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచేలా గ్రామ పంచాయతీలు చర్యలు తీసుకునే విధంగా ఎంపీడీవోలను ఆదేశించారు. డ్రెయిన్లు, కాల్వల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధంచేసి ఇవ్వాలని అడిగారు. సమావేశంలో ఉద్యానవన, ఆర్అండ్‌బీ, రెవెన్యూ, ఇరిగేషన్, డ్రైనేజీ అధికారులతో పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో డీఈఈలు నాగార్జున, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, డ్వామా పీడీ మధుసూదన్, తహసీల్దార్లు పెద్దిరాజు, మేరి, శరణ్య మంగాదేవి, సత్యనారాయణ, బాలాజీ, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలకు రాయితీపై హర్షం

అంబాజీపేట, జూలై 5: అంతర పంటలకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాయితీ ప్రకటించడంపై రైతు సంఘం హర్షం వ్యక్తం చేసింది. అంబాజీపేటలోని కోట బాబు వ్యవసాయ క్షేత్రంలో రైతు సంఘ సమావేశం జరిగింది. ఈసందర్భంగా రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ కొబ్బరి తోటల్లో అంతర పంటలు సాగుచేస్తున్న రైతులకు రాయితీలు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నక్కా భాస్కర్, పొట్టుపోతు స్వామినాయుడు, కొత్తూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

'మౌలిక సదుపాయాలు కల్పించాలి'

ఆత్రేయపురం, జూలై 5: ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, లేకపోతే కఠిన చర్యలు చేపడతామని ఎంఈవో బి.వరప్రసాదరావు హెచ్చరించారు. నిబంధనలకు లోబడి విద్యార్థులకు ప్రవేశం కల్పించాలన్నారు. బోధన అనుభవం ఉన్న ఉపాధ్యాయులనే నియమించుకోవాలని సూచించారు. మండలంలో గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల వివరాలను ఆయన వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు

అంబాజీపేట, జూలై 5: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. అంబాజీపేట హైస్కూల్‌లో విద్యార్థులకు కిట్లను శుక్రవారం పంపిణీచేశారు.రాజధానికి విరాళం అందించిన విద్యార్థులు, తైక్వాండో, బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీడీవో జీవీ సరోవర్, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, నాయకులు గణపతి వీరరాఘవులు, కొర్లపాటి గోపి, బొంతు పెదబాబు, దొమ్మేటి సాయికృష్ణ పాల్గొన్నారు.

ప్రజలకు మంచి సేవలందించాలి

మండపేట, జూలై 5: ప్రజలకు మంచి సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరును తీసుకురావాలని సచివాలయ ఉద్యోగులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సూచించారు. సచివాలయ ఉద్యోగులు సంఘ మండల నాయకులు, ఉద్యోగులు శుక్రవారం ఎమ్మెల్యే వేగుళ్లను పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. యూనియన్ అధ్యక్షుడు ఎస్.దొరబాబు, కార్యదర్శి దుర్గాప్రసాద్, మహ్మద్‌సులేమాన్, మంగాదేవి, సయ్యద్ హమీని, రత్న రాహుల్, మణికంఠ, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

యోగా, ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రాయవరం, జూలై 5: యోగా, ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని యోగా, ధ్యాన ట్రైనర్ సీతాకుమారి అన్నారు. శుక్రవారం రాయవరం సత్యసాయి ధ్యాన మందిరంలో వెలగల వెంకటరెడ్డి పిరమిడ్ ధ్యాన మందిరంలో ఉచిత ధ్యాన శిక్షణ శిబిరం నిర్వహించారు. యోగా, ధ్యానం, ఆత్మ జ్ఞానంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ ఇచ్చిన సీతాకుమారిని ఫణికృష్ణారెడ్డి, మహిళలు సత్కరించారు. యోగా మాస్టర్ ఫణికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాయవరం, కొమరిపాలెం, కొంకుదురు, జి.మామిడాడ పరిసర ప్రాంతాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి తీర్థం

రాయవరం, జూలై5: రాయవరంగ్రామస్థుల ఇలవేల్పు శ్రీమహాలక్ష్మి అమ్మవారితీర్థం శుక్రవారం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి జాతర, శుక్రవారం తీర్థం నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి ప్రతిరూపాలైన గరగలను గ్రామోత్స వం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, రాయవరం పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

రాయవరం, జూలై 5: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, తడి,పొడి చెత్త వేరుచేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వైఆర్కే పరమహంస పిలుపునిచ్చారు. సోమేశ్వరం రెడ్డి కృష్ణమ్మపేటలో శుక్రవారం క్లీన్అండ్ గ్రీన్‌లో భాగంగా గ్రామస్తులకు డస్ట్‌బిన్లు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి పల్లెటి వెంకటరత్నం, ఎం.వెంకటలక్ష్మి, సబ్బెళ్ల చంద్రశేఖరరెడ్డి, తేలు వీర వెంకట సత్యనారాయణ, అంబవరపు సత్యనారాయణ, నాగదేవర శివశంకర్, లంక సూర్యచంద్రరావు, కురుపూడి ఉమా శ్రీనివాస్, కడియాల వెంకటరమణ, నాగేంద్ర పాల్గొన్నారు.

డయేరియాపై ప్రజలకు అవగాహన

మామిడికుదురు, జూలై 5: నగరం పీహెచ్‌సీ పరిధిలోని పాశర్లపూడి, మామిడికుదురు గ్రామాల్లో శుక్రవారం డయేరియాపై అవగాహన సదస్సులు నిర్వహించారు. మామిడికుదురు ఎస్టీ కాలనీ, పాశర్లపూడిలో బొమ్మిడిపాలెంలో డయేరియా ఏవిధంగా వ్యాప్తి చెందుతుంది, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కాలనీ వాసులకు వివరించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎవరికైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. ఈకార్యక్రమాల్లో పీహెచ్‌సీ సిబ్బంది, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన సదస్సు

యానాం, జూలై 5: స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం ఆవరణలో డయేరియా నిర్మూలనపై ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏ మునిస్వామి, ఆసుపత్రి డీడీ డాక్టర్ టి.రవిశంకర్ మాట్లాడారు. ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉంచుకోవడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలుతీసుకోవాలని సూచించారు. అనంతరం ఆసుపత్రి సిబ్బంది గ్రామాల్లో డయేరియా నిర్మూలనపై అవగాహన సదస్సులు నిర్వహించారు.

క్రీడాభారతి సంఘ జిల్లా అధ్యక్షుడిగా శరత్‌బాబు




అల్లాడ శరత్‌బాబు, శ్రీరామచంద్రమూర్తి

అమలాపురం టౌన్, జూలై 5: అమలాపురం దుడ్డువారి అగ్రహారంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో క్రీడాభారతి రాష్ట్ర ప్రాంతీయ కార్యదర్శి జొన్నలగడ్డ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అల్లాడ శరత్‌బాబు, గౌరవాధ్యక్షుడిగా రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, ఉపాధ్యక్షుడిగా చిట్టూరి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా పప్పుల శ్రీరామచంద్రమూర్తి, సహాయ కార్యదర్శిగా కామన మధుసూదన్, ఆర్థిక కార్యదర్శిగా కల్వకొలను వెంకటరమణ (బాబు), కార్యవర్గ సభ్యులుగా ఎ.విజయశ్రీనివాస్, ఎ.రవితేజ, జి.శ్రీనివాస్, వై.స్వామి, కె.ఈశ్వరరావు, ఎం.కిశోర్, బి.శ్రీనివాసరావు, ఎస్.సత్యానందం, జి.సుబ్బారాయుడు, ఎ.శ్రీనివాస్, ఎస్.వెంకటరమణ, వై.ఉషారాణి, ఎ.సూర్యనారాయణ, ఎ.ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. క్రీడాభారతి ద్వారా గ్రామీణ క్రీడలను అభివృద్ధి చేయడమే లక్ష్యమని శరత్‌బాబు పేర్కొన్నారు. యువత స్మార్ట్ ఫోన్లు, మాదకద్రవ్యాలు, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండడం కోసం, శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందింపచేసే లక్ష్యంతో క్రీడాభారతి పనిచేస్తుందన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సీఎం సహాయనిధి విడుదల



సీఎం సహాయనిధి చెక్కును మల్లాడికి అందజేస్తున్న సీఎం రంగసామి

యానాం, జూలై 5: రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు సీఎం సహాయం నుంచి రూ.20.50లక్షలు విడుదలయ్యాయని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. గత సంవత్సరం మే 14న కోరంగి అపెక్స్ కంపెనీలో పని ముగించుకుని ఆటోలో తిరిగి వస్తున్న రొయ్య ఒలుపు కార్మికులను తాళ్లరేవు బైపాస్ వద్ద ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. ఈప్రమాదంలో యానానికి చెందిన 8మంది మృతిచెందగా, ఒక మహిళ ఇప్పటికీ అపస్మారక స్థితిలో ఉంది. ఐదుగురు గాయపడ్డారు. గతంలో పుదుచ్చేరి ప్రభుత్వం రూ.లక్ష పరిహారం ప్రకటించగా మల్లాడి చొరవతో పరిహారం ఒక్కొక్కరికి రూ.2లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు చొప్పున సీఎం సహాయ నిధి నుంచి సీఎం రంగసామి నగదు మంజూరు చేశారు. శుక్రవారం సీఎం రంగసామి ఈనగదు చెక్కును మల్లాడికి అందజేశారు. రెండు రోజుల్లో బాధిత కుటుంబాలకు నగదు అందజేస్తామని మల్లాడి తెలిపారు. యానాం మున్సిపల్ ఉద్యోగులు, పెన్షనర్లకు రూ.3.81కోట్లు అన్‌టైంగ్రాంట్ నిధుల విడుదలకు ప్రభుత్వం అంగీకారం తెలిపిందని ఢిల్లీ ప్రతినిధి మల్లాడి తెలిపారు. గత నెల21న ముఖ్యమంత్రి ఎన్.రంగసామి నేతృత్వంలో జరిగిన సమావేశంలో తీసుకున్ననిర్ణయం మేరకు6నెలల వేతనం విడుదలకు చర్యలు తీసుకోవడం జరిగింది. ఈమేరకు పుదుచ్చేరి ఎల్ఏడీ డైరెక్టర్ శక్తివేల్, డిప్యూటీ డైరెక్టర్ తదితర శాఖల అధికారులతో మల్లాడి సమావేశమయ్యారు.

వరదలు.. ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ

పి.గన్నవరం, జూలై 5: రాబోయే వరదల నేపథ్యంలో ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో స్థానిక మండల స్థాయి అధికారులు, వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా వరద తాకిడికి గురయ్యే గ్రామాలను గుర్తించాలన్నారు. ఆ గ్రామాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలతో షెల్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్‌సౌకర్యం, తాగునీరు, నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉండే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం వరద తాకిడికి గురయ్యే ప్రాంతాలు, ఇబ్బందులు తదితర అంశాలపై ఆర్డీవో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్‌కే హుస్సేన్, ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, డిప్యూటీ తహశీల్దార్ రమాదేవి, ఇన్‌చార్జ్ ఆర్ఐ పి.నరసింహారావు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే బండారు




అమలాపురం టౌన్, జూలై 5: కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రావిరాల మహేష్‌కుమార్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శుక్రవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందించారు. ఆయన వెంట కొత్తపేట నియోజకవర్గ నాయకులు వున్నారు. జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, డీఎల్పీవో పి.బొజ్జిరాజు, జిల్లాపంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడు రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, రెడ్డి శిరీష, సింగంపల్లి దుర్గాశ్రీనివాస్, శెట్టిమల్లి రాజమోహన్, పరంశెట్టి ఆదినారాయణ, దారా రామకృష్ణ, ఏఎస్‌వీఎస్ రాజేశ్వరరావు(రాజా) తదితరులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు. సర్పంచ్‌ల సమాఖ్య ప్రతినిధులు పెనుమాల సునీత, కరాటం రత్నప్రసన్న, గంగుమళ్ల ఏసుబాబు, పెనుమాల ఏడుకొండలు, కరాటం ప్రవీణ్‌లతో పాటు ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు ఈతకోట రాజు, ఉపాధ్యక్షుడు కొడమంచిలి సాయికుమార్ కలెక్టర్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

ఎస్పీ శ్రీధర్‌ను కలిసిన బండారు

ఎస్పీ ఎస్.శ్రీధర్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు దర్నాల రామకృష్ణ, బూసి భాస్కరరావు, యల్లమల్లి జగన్మోహన్, ముద్రగడసుబ్బారావు ఉన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి: ఎమ్మెల్యే వేగుళ్ల



ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వేగుళ్లకు సత్కారం

మండపేట, జూలై 5: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బోనగిరి శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేగుళ్ల మాట్లాడారు. ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాలు ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. వేగుళ్లకు వ్యాపారులు సంఘీయులు నోట్ పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు సంకా వెంకట్రాజు, చెన్నా రాంబాబు, కౌన్సిలర్ కాళ్లకూరి స్వరాజ్యభవాని శ్రీనివాస్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు, వాకచర్ల గుప్తా, కేశవరపు శ్రీనివాస్, సంకా కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీచక్ర అమ్మవారికి కుంకుమ పూజలు



కొత్తపేట, జూలై 5: మండలంలోని ఏనుగులమహల్‌లో శ్రీచక్ర అమ్మవారి ఆలయానికి అమావాస్య సందర్భంగా శుక్రవారం సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు గ్రామస్తులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

నూకాంబికా ఆలయంలో చండీ హోమం

ఆలమూరు, జూలై 5: అమావాస్య సందర్భంగా చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయంలో చండీ హోమాన్ని పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు తిలకించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంఎస్ఆర్ కృష్ణ, జేఏ భాస్కర్‌శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చిత్రపటాల ఏర్పాటు

అమలాపురం రూరల్, జూలై 5: అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలను శుక్రవారం ఏర్పాటుచేశారు. జనసేన మండల శాఖ అధ్యక్షుడు లింగోలు పండు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొప్పుల నాగమానస, పోలిశెట్టి చిన్ని, సత్తి సూరిబాబు, వాకపల్లి వెంకటేశ్వరరావు, పరమట చిట్టిబాబు, నిమ్మకాయల రాజేష్, నల్లా రాముతో పాటు ఎంపీడీవో జి.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి కల్పించండి

కొత్తపేట, జూలై5: నియోజకవర్గ పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వాడపాలెంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని సమస్యలను విన్నవించారు. రేషనలైజేషన్ పద్ధతిలో ఉద్యోగోన్నతి కల్పించాలని, సాంకేతికపరమైన విషయాల్లోనే తమను వినియోగించుకోవాలని, ఇతర శాఖల పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

రూ.90 నాణెం విడుదల



అమలాపురం టౌన్, జూలై 5: భారతీయ రిజర్వు బ్యాంకు 90 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కోల్‌కతాలోని ఆలీపూర్ టంకశాల తొలిసారిగా రూ.90 నాణేన్ని విడుదల చేసింది. 40 గ్రాముల బరువుతో పూర్తి వెండితో తయారు చేసిన ఈనాణేనికి ఒకవైపు ముఖ విలువ, మరోవైపు భారతీయ రిజర్వు బ్యాంకు ముద్రను ముద్రించారు. దీనిని అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన ప్రముఖ నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణకామేశ్వర్ ప్రత్యేక ఆర్డరుపై రప్పించారు.

అధికారులతో ఎమ్మెల్యే వరుస సమీక్షలు



ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, జూలై 5: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలపై ఆయా శాఖల అధికారులతో శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సమీక్షించారు. తాగునీటి సమస్య లేకుండా చేపట్టాల్సిన చర్యలపై ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ పార్థసారథి, ఏఈ చినబాబు తదితరులతో చర్చించారు. అనంతరం రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష జరిపి ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేలా, అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. టీడీపీ అల్లవరం మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, కర్రి దత్తుడుతదితరులు పాల్గొన్నారు.

9న మామిడికుదురులో కౌలు రైతుల సదస్సు

అమలాపురం టౌన్, జూలై 5: మామిడికుదురులో ఈనెల9న రాష్ట్ర కౌలు రైతుల సదస్సు నిర్వహిస్తున్నట్టు జిల్లా శాఖ అధ్యక్షుడు అప్పారి వెంకటేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని, కౌలు రైతుల సమస్యలపై చర్చిస్తామన్నారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఈలి శ్రీనివాసరావు, కారెం వెంకటేశ్వరరావు, తాడి శ్రీరామమూర్తి, కె.శంకర్, కడలి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వసతి గృహాల ఆకస్మిక తనిఖీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 5: రామచంద్రపురంలోని ఎస్సీ బాలురు, బాలికల వసతి గృహాలను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ శ్రీనివాసు ఆకస్మిక తనిఖీ చేశారు. పారిశుధ్యం, మరుగుదొడ్లు పరిశీలించారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	--
వెంకటరమణ	కల్కి 2898 ఏడీ
శ్రీలలిత	మహారాజ
శేఖర్ స్క్రీన్-1	కల్కి 2898 ఏడీ
శేఖర్ స్క్రీన్-2	కల్కి 2898 ఏడీ
రమా	ప్రభుత్వ జూనియర్ కళాశాల
గణపతి	హరోం హర
వెంకటపద్మావతిస్క్రీన్-1	కల్కి 2898
వెంకటపద్మావతి స్క్రీన్-2	కల్కి 2898 ఏడీ

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ముమ్మిడివరం, జూలై5: రోడ్డు ప్రమాదాల నివారణపై ముమ్మిడివరం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహ్మతుల్లా ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి రహ్మతుల్లా మాట్లాడుతూ మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్‌నిబంధనలు పాటిస్తూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహన రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఆత్రేయపురం, జూలై 5: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను దేవదాయ శాఖ డిప్యూటీ ఇంజనీరు జి.శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. అంతరాలయంలో గ్రానైట్, ఆలయం ఎదురుగా కోనేరు అభివృద్ధి పనులను చూశారు. ఈపనులకు సంబంధించి ఉపకమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్‌తో చర్చించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు

కపిలేశ్వరపురం, జూలై 5: కోరుమిల్లి గ్రామానికి ఆర్‌డీఎస్ఎస్ స్కీం ద్వారా ఆరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయి. కొద్ది కాలంగా గ్రామంలో లోవోల్టేజ్, ఓవర్ లోడ్ సమస్యలు ఉండడంతో ఆర్‌డీఎస్ఎస్ స్కీం ద్వారా గ్రామానికి ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయని, వీటిని త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు రామచంద్రపురం డీఈ వై.విజయానంద్ తెలిపారు. ఐదేళ్లుగా ఎన్నిసార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా సమస్యను పట్టించుకోలేదని, ఇప్పుడు ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు చొరవతో సమస్య పరిష్కారమైందని గ్రామసర్పంచ్ ఆచంట సత్యనారాయణ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సుంకర బుజ్జి, ఏఈ సాలెంరాజు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రుద్ర హోమం



ఐ.పోలవరం, జూలై5: మురమళ్ళ శ్రీవీరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జ్యేష్ఠ ఆరుద్ర నక్షత్రం సందర్భంగా రుద్రహోమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకుడు పేటేటిశ్యామలకుమార్ ఆధ్వర్యంలో గణపతి పూజ, మండపారాధన, రుద్రహోమం, పూర్ణాహుతి జరిగాయి. 25మంది గోత్ర నామాలతో పూజ నిర్వహించారు. ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమస్యలు పరిష్కరించాలి

అయినవిల్లి, జూలై 5: ముక్తేశ్వరంలోని శ్రీనరహరిశెట్టి వెంకట్రావు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉద్యోగులు, పార్ట్‌టైమ్ సిబ్బంది శుక్రవారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ దేవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎస్ఎన్‌వీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒక్కటే ప్రభుత్వ కళాశాలగా ఉందని వివరించారు. గత ఏడాది కంటే ఈఏడాది ఎక్కువగా విద్యార్థులు కళాశాలలో చేరారన్నారు. కళాశాలలో పనిచేస్తోన్న పార్ట్‌టైమ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అధ్యాపకులు బి.శ్యామ్‌ఎబెల్, కె.స్వర్ణకుమారి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

కె.గంగవరం, జూలై 5: రామచంద్రపురం నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక సిర్రా సురేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మార్పీఎస్ ఉత్తర కోస్తా జిల్లాల అధ్యక్షుడు ముమ్మిడివరపు చిన సుబ్బారావు మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ సత్తిబాబు మాదిగ ముఖ్య అతిథులుగా హాజరైన సమావేశంలో ఎన్నిక జరిగింది. నియోజకవర్గ కన్వీనర్‌గా సిర్రా సురేష్, కాజులూరు మండలం నుంచి ఖండవల్లి శ్రీనివాసరావు, పలివెల రాజు, కె.గంగవరం మండలం నుంచి మోర్త దొరబాబు, మండపల్లి ప్రకాష్ పెండుర్తి కుమార్‌ను మండల కన్వీనర్లుగా, కోకన్వీనర్లుగా నియమించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాలతో ఎమ్మార్పీఎస్ బలోపేతానికి ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన కన్వీనర్లు, కోకన్వీనర్లు పేర్కొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ముమ్మిడివరం, జూలై 5: ప్రతీ ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సబ్‌యూనిట్ ఆఫీసర్ ఎస్.రాజ్‌కుమార్ పేర్కొన్నారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా కొత్తలంకలో శుక్రవారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అనంతరం సీహెచ్‌వో కృపాబాయి స్టాఫ్ డెంగ్యూపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జి.శ్రీనివాసులు, హెల్త్‌అసిస్టెంట్ నార్ని శ్రీనివాస్, ఏఎన్ఎం కాసులమ్మ, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మరింత తోడ్పాటు

అంబాజీపేట, జూలై 5: కూటమి ప్రభుత్వంలో దివ్యాంగులకు మరింత తోడ్పాటు అందిస్తామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక కొర్లపాటివారిపాలెం కాపుసామాజిక భవనం వద్ద కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు పింఛన్‌రూ.6వేలకు పెంచడంపై సంబరాలు చేసుకున్నారు. చంద్రబాబు, పవన్ ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, బొంతు శ్రీను, శ్రీను, షేక్ సుభాన్, యల్లమల్లి సుందరరావు, ఎం.కనకదుర్గ, జయను పరంకుశం, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

సేవ్ ట్రీ.. సేవ్ లైఫ్

అమలాపురంటౌన్, జూలై5: వనమహోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని అమలాపురం గొల్లగూడెం ఆదిత్య పాఠశాల విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. సేవ్ ట్రీ సేవ్ లైఫ్ నినాదంతో ప్లకార్డులు చేతబూని పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పలుచోట్ల మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు ఇప్పుడే పునాది పడాలంటూ ముందుకు సాగారు. గడియార స్తంభం సెంటర్లో పోలీసు అధికారులకు మొక్కలుఅందించారు. ప్రిన్సిపాల్ కె.లక్ష్మీదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏఎస్ఐ ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు. విద్యార్థులను చైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డిఅభినందించారు.

సెంటాక్ అడ్మిషన్లు నిలిపివేత

యానాం,జూలై5: పుదుచ్చేరిలో వివిధ ఇంజనీరింగ్, మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే సెంటాక్ అడ్మిషన్ ప్రక్రియను నిలిపివేస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటికే కోర్సుల్లో ప్రవేశానికి మెరిట్ జాబితా సెంటాక్ విడుదలచేసింది. హైకోర్టు తీర్పుతో అడ్మిషన్లు తాత్కాలికంగా నిలిపివేసినట్టు సెంటాక్ అడ్మిషన్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పల్లాను కలిసిన మంత్రి సుభాష్



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం అమరావతి పార్టీ కార్యాలయంలో కలిశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు మంత్రి అభినందనలు తెలిపారు. మంత్రితో పాటు టీడీపీ నాయకులు గంధం పళ్లంరాజు, రాయపురెడ్డి రాజాలు శ్రీనివాసరావును కలిశారు. రామచంద్రపురం(ద్రాక్షారామ).

కారు బోల్తా

ముమ్మిడివరం, జూలై 5: కారు అదుపుతప్పి బైపాస్ రోడ్డులో బోల్తా కొట్టింది. మంగళగిరికి చెందిన ఐదుగురు విద్యార్థులు శుక్రవారం కారులో కాకినాడ వెళ్లారు. తిరిగి మంగళగిరి వెళుతుండగా ముమ్మిడివరం బైపాస్ రోడ్డులో కుక్క అడ్డు రావడంతో కారు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకు వెళ్లి బోల్తా కొట్టింది. ఈప్రమాదంలో పెద్దగా ఎవరూ గాయపడలేదు.

దమ్ము ట్రాక్టర్ కింద పడి యువకుడి మృతి



ద్రాక్షారామ, జూలై 5: దమ్ముట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి చెందాడు. కాపవరానికి చెందిన సిద్దాల తరుణ్‌కుమార్ ట్రాక్టర్‌తో దమ్ము చేస్తుండగా ప్రమాదవశాత్తు దమ్ముచక్రం కిందపడ్డాడు. సమీప పొలంలో ఉన్నవారు వచ్చేటప్పటికి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ద్రాక్షారామ ఎస్ఐ సురేంద్రబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా తరుణ్‌కుమార్ తండ్రి 15ఏళ్ల క్రితం మరణించాడు. తల్లి ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లింది. అమ్మమ్మ, తాతయ్య వద్ద సోదరితో కలిసి తరుణ్‌కుమార్ ఉంటున్నాడు. తరుణ్‌కుమార్ అకాల మరణంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

మెట్ల పైనుంచి జారి పడి వ్యక్తి మృతి

మామిడికుదురు, జూలై 5: మెట్ల పైనుంచి జారిపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. బి.దొడ్డవరానికి చెందిన యేడిద కేశవరావు(63) ఆరేళ్ల క్రితం పక్షవాతం రావడంతో కాలు, చెయ్యి పడిపోయి ఇంటి వద్దే వైద్యం పొందుతున్నాడు. గురువారం ఉదయం అతడిని భార్య సాయమ్మ బాత్‌రూమ్‌కు తీసుకువెళుతుండగా అరుగు మెట్లపై నుంచి జారిపడ్డాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మరణించినట్టు ఎస్ఐ తెలిపారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాలు

కపిలేశ్వరపురం, జూలై 5: అంగరలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో మేడిద సత్యవతి, మేడిద దుర్గాభవాని కుటుంబాలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు తనవంతు సహాయంగా బియ్యం, నిత్యావసరాలు, దుస్తులు, వంటసామగ్రి పంపిణీ చేశారు. ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్వోలు పి.నాగమణి, ఎన్‌వీ ప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు ద్వారపూడిలో రక్తదాన శిబిరం

మండపేట, జూలై5: ద్వారపూడిలోకి చెందిన స్వర్గీయ సుంకర వెంకటరమణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం రక్తదానశిబిరం నిర్వహిస్తామని ట్రస్టీ సుంకరనాని తెలిపారు. శిబిరాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభిస్తారు. విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తామన్నారు.

ఫొటోగ్రాఫర్స్ మండల అధ్యక్షుడిగా నల్లి శ్రీనివాస్

అంతర్వేది, జూలై 5: సఖినేటిపల్లి మండల ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్లి శ్రీనివాస్(రాజా స్టూడియో), ఉపాధ్యక్షుడిగా ఎస్వీ రత్నం (వంశీ స్టూడియో), కార్యదర్శిగా బుంగ కుమార్ (జెన్ని స్టూడియో), సహ కార్యదర్శిగా సీహెచ్ కిశోర్ (వాసవి స్టూడియో), కోశాధికారిగా నల్లి శేఖర్ (వెన్నెల స్టూడియో), గౌరవాధ్యక్షుడిగా నల్లి స్టాలిన్, దాసరి నరసింహారావు, గౌరవ సలహాదారులు పాలపర్తి శేఖర్, మేడిద నవీన్, సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి జిల్లా అధ్యక్షుడు జి.నగేష్, సీవీ రావు, సాయి, దొరబాబు అభినందనలు తెలిపారు.